మెదక్ జిల్లా రామాయంపేట ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

మాడల్ స్కూల్‌లో ఫుడ్ పాయిజన్

35 మంది కళాశాల విద్యార్థినులకు అస్వస్థత

రామాయంపేట, జూలై 9: మెదక్ జిల్లా రామాయంపేట బల్దియా పరిధి కోమటిపల్లిలోని తెలంగాణ మాడల్ స్కూల్ కళాశాలలో మంగళవారం ఉదయం అల్పాహారం తిని 35 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వసతి గృహ సిబ్బంది వారిని హుటాహుటిన రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. వైద్యం అందించిన తర్వాత 32 మంది కోలుకోవడంతో హాస్టల్‌కు తరలించారు. మరో ముగ్గురికి దవాఖానలోనే మెరుగైన వైద్యం అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు దవాఖానకు వెళ్లి విద్యార్థినులను పరామర్శించి ధైర్యం చెప్పారు. డీఈవో రాధాకిషన్, ఉప వైద్యాధికారి అనిల, ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ రజినీకుమారి, వైద్యురాలు హరిప్రియ, ప్రదీప్, సుకేషిని దవాఖానలో విద్యార్థినులను పరామర్శించారు.

చట్నీలో ఎలుక.. వడలో ఈగ

- సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూలో ఘటన
- విద్యార్థుల ఆందోళన
- కేర్ టేకర్ల తొలగింపునకు అదనపు కలెక్టర్ ఆదేశాలు
- ఘటనపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆరా



చౌటకూర్, జూలై 9: సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ ఇంజినీరింగ్ కళాశాల బాలుర హాస్టల్‌లోని మెస్‌లో పల్లి చట్నీ పాత్రలో ఎలుక చక్కర్లు కొట్టడం చర్చనీయాంశమైంది. సోమవారం సాయంత్రం పల్లి చట్నీ పాత్రలో ఎలుక సంచరించడాన్ని అక్కడున్నవారు వీడియో తీశారు. మంగళవారం ఉదయమే ఈ వీడియోను పలు సోషల్‌మీడియా గ్రూపుల్లోకి షేర్ చేయగా వైరల్‌గా మారింది. హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ అధికారుల బృందంతోపాటు సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి హుటాహుటినా కళాశాలకు వచ్చి విచారణ చేపట్టారు. సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో సుమారు 1400 మంది విద్యార్థులు వేర్వేరుగా హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్నారు. హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి, సీఈ వెంకటేశ్వర్‌రెడ్డి, ఇతర అధికారుల బృందం కళాశాలకు చేరుకుని పరిస్థితిని సమీక్షించింది. నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు మెస్ కాంట్రాక్టర్‌ను తొలిగిస్తున్నట్టు అక్కడే ప్రకటించారు. తమకు అధ్వానమైన భోజనాన్ని అందిస్తున్నారంటూ జేఎన్‌టీయూ రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. మెస్‌లు శుభ్రంగా లేనందున ఎలుకలు, బల్లులు, ఈగలు సంచరిస్తున్నాయని విద్యార్థులు గగ్గోలు పెట్టారు.

మంత్రి రాజనరసింహ ఆరా

ఎలుక సంచారంపై వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఆరా తీశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పునరావృతం కాకుండా చర్య లు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఉపాధ్యాయుల కోసం చిన్నంబావిలో రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు, తల్లిదండ్రులు

సారూ.. మాకు టీచర్లు కావాలె

పాఠశాలకు తాళం వేసి.. తల్లిదండ్రులతో కలిసి చిన్నంబావిలో విద్యార్థుల నిరసన

చిన్నంబావి, జూలై 9: 'సారూ.. మాకు పాఠాలు బోధించేందుకు సరిపోను స్టాఫ్ లేదు. మా పాఠశాలకు ఉపాధ్యాయులు కావాలి' అంటూ విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేశారు. వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం అయ్యవారిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు తాళం వేసి విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు మంగళవారం మండల కేంద్రానికి వచ్చి వాల్మీకి చౌరస్తాలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మాట్లాడుతూ.. పాఠశాలకు ఉపాధ్యాయులను వెంటనే నియమించాలని కోరారు. పాఠశాలలో 69 మంది విద్యార్థులకుగాను ఒక ప్రధానోపాధ్యాయుడు, ఒక వ్యాయామ టీచర్ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వారి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేశారు. గత విద్యా సంవత్సరంలో హిందీ, ఇంగ్లిష్, సోషల్ సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేకున్నా వలంటీర్లతో తరగతులు నెట్టుకొచ్చారని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కనీసం ఆరుగురు టీచర్లు అవసరం ఉన్నదని, ఈ విషయాన్ని పలుమార్ల విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోయారు.

సింగరేణి కార్మిక సంఘాలపై ఉక్కుపాదం

మొదటిపేజీ తరువాయి...

జరుగుతున్న పరిణామాలు, బొగ్గు గనుల వేలంపై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి ఇటువంటి అనుమానాలకు బలం చేకూరుస్తున్నదని చెప్తున్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా బొగ్గు గనుల వేలం ప్రక్రియను చేపట్టిన కేంద్ర ప్రభుత్వం.. గత నెలలో హైదరాబాద్‌లో ఈప్రక్రియను లాంఛనంగా ప్రారంభించింది. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం బొగ్గు గనుల వేలాన్ని వ్యతిరేకించింది. వేలం వేయకుండా అడ్డుకున్నది. సింగరేణికి నేరుగా గనులు కేటాయించాలని అప్పటి సీఎం కేసీఆర్ ఎన్నోసార్లు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ బొగ్గు గనుల వేలాన్ని అడ్డుకోవడంలో విఫలమైందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. బొగ్గు గనుల వేలాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటనల రూపంలో వ్యతిరేకిస్తున్నప్పటికీ, అంతర్గతంగా సమర్థిస్తున్నదనే ఆరోపణలున్నాయి. బొగ్గు గనుల వేలంపై ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరుకావడం, బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని వ్యతిరేకిస్తున్నట్టు వినతిపత్రం ఇవ్వడం ఉదహరిస్తున్నారు.

కార్మికసంఘాల పోరుబాట

బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ, వేలానికి వ్యతిరేకంగా సింగరేణిలోని అన్ని కార్మిక సంఘాలు ఆందోళన చేస్తున్నాయి. తొలుత తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు ప్రారంభించగా, ఇతర సంఘాలు సైతం పోరుబాట పట్టాయి. సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ సైతం ఆందోళన బాటపట్టింది. కాంగ్రెస్ అనుబంధ ఐఎన్టీయూసీ కూడా బొగ్గు బ్లాక్‌ల వేలానికి వ్యతిరేకమని చెప్తున్నది. సీపీఐ, సీపీఎం అనుబంధ సంఘాలు ఏఐటీయూసీ, సీఐటీయూ కూడా ఆందోళనలు చేస్తున్నాయి. జాతీయ కార్మిక సంఘం హెచ్‌ఎంఎస్ కూడా విప్లవ కార్మిక సంఘాలైన ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూతోపాటు టీఎస్టీయూసీ ఇతర కార్మిక సంఘాలను కలుపుకొని ఐక్య కూటమిగా ఆందోళనలు చేపడుతున్నది. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం మంగళవారం గోదావరిఖనిలో తలపెట్టిన మహాధర్నాకు అనివార్య కారణాలతో కేటీఆర్ హాజరుకాలేకపోవడంతో దానిని వాయిదా వేసినప్పటికీ, ఆ కార్యక్రమం స్థానంలో మోదీ కుట్రలపై సదస్సును నిర్వహించింది.

ఉక్కుపాదం

సింగరేణిలో కార్మికసంఘాలు చేస్తున్న పోరాటాల ప్రభావం దేశవ్యాప్తంగా ఇతర బొగ్గు గనుల మీద పడే అవకాశం ఉంది. దీంతో కేంద్రానికి సింగరేణిలో జరుగుతున్న ఆందోళనలు మింగుడు పడటం లేదు. నిరసన కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలన్న నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తుండగా.. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా సహరిస్తుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అందులో భాగమే.. సికాస మాజీ నాయకుడు మహ్మద్ హుస్సేన్ అలియాస్ రమాకాంత్ అలియాస్ సుధాకర్‌ను అరెస్ట్ చేశారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి ఆయన తుపాకీని విడిచిపెట్టి, దశాబ్ద కాలానికిపైగా ప్రజల మధ్య సాధారణ జీవితం గడుపుతున్నారు. ఇప్పుడు హఠత్తుగా సికాస పునర్నిర్మాణానికి పాల్పడుతున్నారని, అందుకే అరెస్టు చేశామని పోలీసులు చెప్పుండటం గమనార్హం. వేలానికి నిరసగా గళమెత్తే కార్మికసంఘాలు, నాయకులను భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా.. నిరసనల్లో సికాస పాల్గొంటున్నదని చెప్పి, ఆందోళనకు అడ్డుకట్ట వేసే కుట్ర ఇందులో దాగి ఉన్నదని పలు కార్మిక సంఘాలు అంతర్గతంగా చర్చించుకుంటున్నాయి.

కంటి ఆపరేషన్ ఉన్న వ్యక్తిపై కఠినచట్టాలు

తుపాకీ వీడి సాధారణ జీవితం గడుపుతున్న సికాస మాజీ నాయకుడు రమాకాంత్ వయోభారంతో ఉన్నారు. కంటిచూపు మందగించింది. ఈ నెల 2న వరంగల్‌లో కంటి ఆపరేషన్ జరగాల్సి ఉండే. అక్కడ వైద్యులు సమ్మె చేయడంతో ఈ నెల 8కి వాయిదా పడింది. ఆపరేషన్‌కు వెళ్దామనుకున్న సమయంలోనే రమాకాంత్‌ను పోలీసులు ఆరెస్టు చేశారు. ఆయన సహజ శైలి ప్రశ్నించే తత్వం. ఎవరైనా ఒక సమస్య కోసం అతని వద్దకు వెళ్తే అందరూ సంఘంగా ఏర్పడి.. పోరాడితే పరిష్కారం అవుతుందని సూచించే వ్యక్తి. అందుకే ఆయనను అనేక సంఘాలు కలిసేవి. సికాసకు ఆయన దూరంగా ఉన్నారు. సింగరేణిని ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకోవాలని, వేలం కాకుండా చూడాలని, సంఘాలన్నీ ఒక్కతాటిపైకి వస్తేనే ఇదంతా సాధ్యమని సన్నిహితులతో చెప్పుండేవారని తెలుస్తున్నది. ప్రస్తుతం ఇదే మాటలను అడ్డుపెట్టుకొని.. పోలీసులు ఆయనను అరెస్టు చేశారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కఠిన చట్టాలు

మహ్మద్ హుస్సేన్‌పై పోలీసులు కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేశారు. ఐపీసీ సెక్షన్ 10,12,18,18(బీ) ఉపా యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. చట్ట విరుద్ధమైన సంస్థలో సభ్యుడిగా ఉండటం, చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడటం, కుట్రలు చేయడం, కుట్రలను ప్రేరేపించడం, సలహాలు ఇవ్వడం, ఉగ్రవాద చర్యల కోసం వ్యక్తులను రిక్రూట్ చేసుకోవడం అనే సెక్షన్ల కింద కేసు పెట్టారు. ఉపా చట్టం కింద అదుపులోకి తీసుకుంటే నాన్ బెయిలెబుల్ ఉంటుంది. సంవత్సరాల కొద్ది జైలు శిక్షలు పడే అవకాశం ఉంటుంది.

సంఘాలను అణిచివేసే కుట్ర

మహ్మద్ హుస్సేన్ చాలాకాలంగా సాధారణ జీవితం గడుపుతున్నారు. ఆయనను హఠాత్తుగా అరెస్టు చేయడం, కఠిన చట్టాల కింద కేసులు నమోదుచేయడం చూస్తుంటే సింగరేణిలో సంఘాల నిరసనలను తొక్కిపెట్టడమే లక్ష్యంగా కనిపిస్తున్నది. ఆయనకు కంటిచూపు మందగించింది. వృద్ధాప్యదశలో అనారోగ్య కారణాలతో బాధపడుతున్నారు. అటువంటి వ్యక్తి ఇప్పటికిప్పుడు సికాస పునర్నిర్మాణానికి ఎలా పాల్పడుతాడు. ఇదంతా ప్రైవేటీకరణకు, వేలానికి నిరసన చేపడుతున్న సంఘాలను అణిచివేసేందుకు జరిగిన కుట్రగానే భావిస్తున్నాం. ప్రభుత్వం తన ధోరణి మార్చుకోవాలి.

- మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ తిరుపతయ్య

పంచాయతీ కార్యదర్శి శివాజీ

బిల్లుల మంజూరుకు 20 వేల లంచం

ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

రఘునాథపల్లి, జూలై 9: బిల్లులు మంజూరు చేసేందుకు తాజా మాజీ సర్పంచ్ వద్ద లంచం తీసుకుంటూ పంచాయతీ కార్యదర్శి ఏసీబీ అధికారులకు చిక్కాడు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కంచనపల్లి తాజా మాజీ సర్పంచ్ గవ్వాని విజయ-నాగేశ్వర్‌రావు గ్రామంలో అభివృద్ధి పనులు చేశారు. తమకు రావాల్సిన రూ.1.5 లక్షలకు బిల్లులు చేయాలని పంచాయతీ కార్యదర్శి శివాజీని కలిశారు. అందుకు ఆయన రూ.20 వేలు డిమాండ్ చేశాడు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నాగేశ్వర్‌రావు నుంచి కార్యదర్శి శివాజీ డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

బెట్టింగ్ యాప్‌నకు విద్యార్థి బలి

- ఫీజు రూ.లక్షతో ఆట
- తల్లిదండ్రుల మందలింపు
- రైలు కిందపడి విద్యార్థి ఆత్మహత్య

మారేడ్‌పల్లి, జూలై 9: తల్లిదండ్రులు కాలేజీ ఫీజు కట్టాలని కొడుకుకు డబ్బులిస్తే.. ఆ డబ్బులను బెట్టింగ్ ఆడి పోగొట్టుకున్నాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. నల్లగొండలోని రవీంద్రనగర్‌కు చెందిన కోడూరు నితిన్(21) ఘట్‌కేసర్ సమీపంలోని యమనంపేటలో ఉంటూ అక్కడే శ్రీనిధి కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల ఫీజు కట్టాలని తల్లిదండ్రులు నితిన్‌కు రూ.లక్షా 20 వేలు ఇచ్చారు. ఈ డబ్బును బెట్టింగ్‌లో పెట్టి పోగొట్టుకున్నాడు. ఫీజు డబ్బుల కోసం కళాశాల యాజమాన్యం నితిన్ తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పది రోజుల కిందట నితిన్‌ను మందలించారు. మనస్తాపానికి గురైన అతడు మంగళవారం ఘట్‌కేసర్ -చర్లపల్లి రైల్వే స్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెడకు టవల్ బిగుసుకుని అంధ విద్యార్థి మృతి

కరీంనగర్ రాంనగర్, జూలై 9: కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం రేకుర్తిలోని అంధుల పాఠశాలలో ఓ అంధ విద్యార్థి మెడకు టవల్ బిగుసుకుని మృతి చెందాడు. ఈ ఘటనకు పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోటకు చెందిన దాన శ్రీవాత్సవ్ (12) రేకుర్తిలోని అంధుల పాఠశాలలో చదువుకుంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం గదిలోకి వచ్చిన శ్రీవాత్సవ్.. వానకాలం కావడంతో బట్టలు ఆరేసేందుకు గదిలో వైరుతో దండెం కట్టాడు. దానిపై ఆరేసిన టవల్‌తో తోటి సహచరులతో కలిసి శ్రీవాత్సవ్ ఆడుకుంటుండగా టవల్ మెడకు బిగుసుకుపోయి మృతి చెందాడు. సహచరులు కూడా అంధులే కావడంతో ఆ విషయాన్ని ఎవరూ గమనించలేదు. అప్పుడే క్లాసులకు హాజరైన తోటి విద్యార్థులు గదిలోకి రాగానే దుర్వాసన వచ్చింది. దీంతో అనుమానం వచ్చిన అంధ విద్యార్థులు అక్కడి సిబ్బందికి విషయం తెలిపారు. వెంటనే పాఠశాల సిబ్బంది అతడిని దవాఖానకు తరలించగా అప్పటికే శ్రీవాత్సవ్ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

ఏటీఎంనే ఎత్తుకెళ్లారు

- కామారెడ్డి జిల్లాలో ఘటన

బిచ్కుంద, జూలై 9: ఏటీఎంలో చోరీ కోసం వచ్చిన దొంగలకు లాకర్ తెరవడం సాధ్యంకాక చివరికి ఏటీఎం యంత్రాన్నే ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున కామారెడ్డి జిల్లా బిచ్కుందలో చోటుచేసుకున్నది. మాస్కులు ధరించిన దుండగులు తెల్లవారుజామున 3.25 గంటల సమయంలో ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలోకి చొరబడ్డారు. సీసీ కెమెరాలపై స్ప్రే చల్లి, ధ్వంసం చేసి ఏటీఎంను తెరిచేందుకు యత్నించారు. ఇది గమనించిన ఓ గుర్తుతెలియని వ్యక్తి పోలీసులకు సమాచారమిచ్చాడు. పెట్రోలింగ్ సిబ్బంది అక్కడకు చేరుకునేలోపు దొంగలు ఏటీఎం మెషిన్‌తో ఉడాయించారు. చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు పోలీసులను అప్రమత్తం చేశారు. ఏటీఎంలో రూ.3.95 లక్షల నగదు ఉన్నట్టు బ్యాంకు అధికారులు తెలిపారు. మరోవైపు, జుక్కల్ మండలం పెద్దగుల్లా శివారులో అనుమానాస్పదంగా ఉన్న వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని బిచ్కుంద ఠాణాకు తరలించారు.

భార్యను చంపి భర్త సూసైడ్

కాశీబుగ్గ, జూలై 9: కుటుంబ తగాదాలతో భార్యను చంపి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన గ్రేటర్ వరంగల్‌లో మంగళవారం చోటుచేసుకుంది. నగరంలోని 18వ డివిజన్ చెన్నారెడ్డి కాలనీకి చెందిన మంద చేరాలు (45), స్వప్న (42) దంపతులు. వీరికి అంధుడైన కుమారుడితోపాటు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. చేరాలు మేస్త్రీ పనిచేస్తుండగా, స్వప్న బట్టల దుకాణంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నది. సోమవారం రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరగగా.. చేరాలు స్వప్నను రోకలిబండతో తలపై బాది హత్య చేశాడు. మంగళవారం ఉదయం చేరాలు పురుగు మందు తాగి మృతి చెందాడు. ఉదయం 11 గంటల సమయంలో పిల్లలను బంధువులు తీసుకురాగా ఇంటికి గొళ్లెం పెట్టి ఉన్నది. పక్క నుంచి తలుపులు తీసి చూడగా వారు విగతజీవులుగా పడి ఉన్నారు. పక్కింటివారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తులో ఉందని పోలీసులు తెలిపారు. తల్లిదండ్రులు మృతి చెందడంతో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు.

పాముకాటుతో రైతు మృతి

కల్వకుర్తి రూరల్, జూలై 9: పొలం వద్ద పాముకాటుతో రైతు మృతి చెందాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటు చేసుకున్నది. కల్వకుర్తి పట్టణం జేఎల్‌బీ రోడ్డులో ఉండే రైతు వసంత యాదయ్య (48) మంగళవారం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. ఎల్లికల్ రోడ్డు కైలాసం గుట్ట సమీపంలో బోరు మోటరు ఆన్‌చేసే క్రమంలో పాముకాటుకు గురయ్యాడు. పక్కపొలంలోని రైతులు గమనించి అతడిని దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కాకతీయ జూలాజికల్ పార్కులో జంతువుల దత్తత

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): వరంగల్‌లోని కాకతీయ జూలాజికల్ పార్కు జంతు ప్రేమికులను ఆకర్షిస్తున్నది. స్వయంగా పక్షుల ఆలన, పాలన సంరక్షణ చూసేవారికి పక్షులు, జంతువులను దత్తత ఇస్తున్నది. 2016లోనే ఈ పథకాన్ని ప్రారంభించగా, ఇప్పటి వరకు 90 మంది వివిధ జంతువులు, పక్షులను దత్తత తీసుకున్నారని జూలాజికల్ పార్కు అధికారి మయూరి తెలిపారు. దత్తత తీసుకున్నవారిపై భారం పడకుండా 3, 6 నెలలు, ఏడాది స్కీంను అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు. పక్షులను దత్తత తీసుకోవాలనుకొనే దాతలు జిల్లా అటవీ అధికారి హనుమకొండ 9440810093, ఫారెస్ట్ రేంజర్ జూలాజికల్ పార్క్ 8019919959, సెక్షన్ ఆఫీసర్ జూలాజికల్ పార్క్ 7780378972లో లేదా www.kakatiyazoo.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

ఖజానాకు కిక్కు

మొదటిపేజీ తరువాయి...

లేవు. సీఎం స్థాయిలో ఒక్కసారి మాత్రమే ఎక్సైజ్‌శాఖపై రివ్యూ చేసి, ఆ తర్వాత మిన్నకుండిపోయారు. కొన్ని రోజులుగా గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు పెరిగాయని ప్రజలు ఆందోళనబాట పడుతున్నారు.

గత ఏడాది కంటే పెరిగిన అమ్మకాలు

కాంగ్రెస్ ప్రభుత్వం మద్యం అమ్మకాలపై వచ్చే నిధులపైనే ఆధారపడిందనే విమర్శలొస్తున్నాయి. అలవిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు ఎక్సైజ్‌శాఖనే నమ్ముకున్నది. కమర్షియల్ ట్యాక్స్ తర్వాత అత్యధికంగా డబ్బులు కురిపించే కల్పతరువుగా ఎక్సైజ్‌శాఖను గుర్తించింది. మద్యం అమ్మకాల నుంచి ఎక్సైజ్ శాఖకు ప్రతినెలా దాదాపు రూ.3 వేల కోట్ల ఆదాయం వచ్చేది. ఇప్పుడు అది రూ.3,420 కోట్లకు చేరింది. గడిచిన ఆరు నెలల్లోనే రూ.23 వేల కోట్లు ఆదాయం వచ్చింది. ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న రూ.45 వేల కోట్ల ఆదాయం ఇట్టే వచ్చేట్టు కనిపిస్తున్నది. అంటే ఆ స్థాయిలో మద్యం అమ్మకాలు పెంచారని సమాచారం. ఎక్సైజ్‌శాఖ నుంచి 2022లో రూ.32 వేల కోట్లు, 2023లో రూ.34 వేల కోట్లు ఆదాయం వచ్చింది.

డిమాండ్‌కు మించి సప్లై

కాంగ్రెస్ ప్రభుత్వం అనుకున్న లక్ష్యాన్ని త్వరగా చేరుకునేందుకు డిమాండ్‌కు మించి మద్యం, కొన్ని ప్రముఖ బ్రాండ్ మినహాయించి బీర్లను సప్లై చేసినట్టు తెలిసింది. గత మూడు, నాలుగు నెలల్లోనే 90 లక్షల కేసుల లిక్కర్, 138.56 లక్షల కేసుల బీర్లను విక్రయించారంటే ఏ స్థాయిలో అమ్మకాలు జరిగాయో తెలిసిపోతుంది. ఒక్క ఏప్రిల్‌లోనే రూ.902.28 కోట్ల బీర్లు అమ్మారు. 2023 ఏప్రిల్‌లో ఈ అమ్మింది రూ.764 కోట్లు మాత్రమే. గత ఏడాది కంటే ఈసారి 19 శాతం బీర్ల అమ్మకాలు పెంచారు. అన్ని డిపోల్లో ఒక్క ఏప్రిల్ నెలకు 2.28 లక్షల కేసుల బీర్లను నిల్వఉంచారు. జనవరి నుంచి ఏప్రిల్ నాటికే 50.14 లక్షల కేసుల బీర్లను అమ్మారు. దీన్ని బట్టి మద్యం అమ్మకాలపై ప్రభుత్వం ఏ స్థాయిలో ఆధారపడిందో అర్థం చేసుకోవచ్చని విశ్లేషకులు చెప్తున్నారు. గత ప్రభుత్వం క్రమపద్ధతిలో మద్యం అమ్మకాలు చేపట్టినా 'తెలంగాణను తాగుబోతు రాష్ట్రంగా చేశారు' అంటూ విమర్శలు గుప్పించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడెందుకు మౌనం పాటిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. నాడు బెల్ట్‌షాపులు, మద్యం అమ్మకాలపై గగ్గోలు పెట్టిన ఒక వర్గం మీడియా ఇప్పుడు స్పందించకపోవటం గమనార్హం.

మద్యం అమ్మకాల ఆదాయ వివరాలు

సంవత్సరం	రూ. కోట్లలో
2022-23	32,645
2023-24	34,869
2024-25	45,000 (అంచనా)

ఖమ్మం పోడు రైతు ఆత్మహత్యాయత్నం

మొదటిపేజీ తరువాయి...

ప్రసాద్, కానిస్టేబుల్ లక్ష్మణ్ రఘునాథపాలెం పోలీసులను ఆశ్రయించారు. పట్టాదారు పాస్ పుస్తకం తెచ్చుకున్న కానిస్టేబుల్ లక్ష్మణ్ అసలు ఈ గ్రామానికి చెందిన వాడు కాదని, పట్టా ఎలా వచ్చిందో విచారణ చేసి తనకు న్యాయంచేయాలని ప్రసాద్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై విచారణ చేపట్టిన సీఐ శ్రీహరి.. అటవీ, రెవెన్యూ శాఖల అధికారులను నివేదిక కోరాడు. అటవీ శాఖ అధికారుల రికార్డు మేరకు కానిస్టేబుల్ లక్ష్మణ్‌కు పట్టా ఉన్నదని, ప్రసాద్ తాను సాగు చేసుకుంటున్న భూమిపై ఎలాంటి ఆధారాలు లేవన్నట్టుగా నివేదిక ఇచ్చినట్టు తెలిసింది. దాని ప్రకారం కానిస్టేబుల్ లక్ష్మణ్‌కు న్యాయం చేసే క్రమంలో సీఐ తనను నిత్యం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు బాధితుడు ప్రసాద్ ఆరోపించాడు. 20 రోజులుగా స్టేషన్‌కు పిలిపించి కూర్చోబెడుతున్నారని వాపోయాడు. తాను స్టేషన్‌లో కూర్చున్న సమయంలో కానిస్టేబుల్ లక్ష్మణ్ కొందరు మనుషులను తీసుకెళ్లి తాను వేసిన పత్తి పంటను నాశనం చేసినట్టు ఆవేదన వ్యక్తంచేశాడు. స్టేషన్‌లో ఉన్న తాను వెంటనే ఈ విషయాన్ని సీఐకి ఫోన్ చేసి తెలుపగా.. సదరు భూమి కానిస్టేబుల్ లక్ష్మణ్‌కు చెందింది కదా? అంటూ సమాధానం ఇవ్వడంతోపాటు అడ్డుకుంటే కేసులు నమోదు చేస్తానని బెదిరింపులకు పాల్పడినట్టు వాపోయాడు. ప్రసాద్ ప్రస్తుతం ఖమ్మంలోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్నాడు.

సీఐ వేధింపులు తాళలేకనే..

15 ఏండ్లుగా సాగు చేసుకుంటున్న భూమి దక్కదేమోననే ఆందోళనతోపాటు సీఐ తనపై రౌడీషీట్, పీడీ యాక్ట్ నమోదు చేస్తానని బెదిరించడంతోనే ప్రసాద్ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు అతడి భార్య లలిత ఆరోపించింది. ప్రసాద్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడేందుకు ప్రేరేపించిన రఘునాథపాలెం సీఐ శ్రీహరి, ఎఫ్‌ఆర్వో రాధిక, కానిస్టేబుల్ లక్ష్మణ్‌పై చర్యలు తీసుకోవాలని ఆమె ఖమ్మం సీపీకి ఫిర్యాదు చేసింది.

కేఆర్‌ఎంబీ పరిధిలోకి ప్రాజెక్టుపై సుప్రీంలో విచారణ

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నుంచి విద్యుత్తు ఉత్పత్తి, ఇతర అవసరాలకు అనుమతులు లేకుండా నీటిని వాడేస్తున్నారని ఆరోపిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అభయ్ ఎస్ ఒఖా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మైశ్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. కృష్ణా పరీవాహక ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీ పరిధిలోకి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఏపీ చెప్పగా, ఇదే అంశంపై విముఖత వ్యక్తంచేస్తూ తెలంగాణ అఫిడవిట్ దాఖలు చేసింది. రెండు ప్రభుత్వాల అభిప్రాయాలకు అనుగుణంగా కేంద్రం నిర్ణయం తీసుకోవాలని ఇరు రాష్ట్రాల న్యాయవాదులు కోరారు. ఈ విషయంలో కేంద్రం నుంచి సూచనలు, ఆదేశాలు తీసుకోవాల్సి ఉన్నదని కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటియా కోర్టుకు వివరించారు. తదుపరి విచారణను ఆగస్టు 20కి ధర్మాసనం వాయిదా వేసింది. ఆ లోపు అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది.

మేడిగడ్డ ఇసుక టెండర్లు ఖరారు

హైదరాబాద్, జూలై 9(నమస్తే తెలంగాణ): మేడిగడ్డ ప్రాజెక్టు వద్ద మేటవేసిన ఇసుకను తొలగించేందుకు మంగళవారం తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ టెండర్లు ఖరారు చేసింది. 92లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను 14 బ్లాకులుగా విభజించి టెండర్లు ఆహ్వానించగా 400 ఏజెన్సీలు దాఖలు చేశాయి. వాటిలో లాటరీ పద్ధతిలో ఎంపికచేసి కాంట్రాక్టులు ఖరారు చేశారు. త్వరలోనే అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల వద్ద ఇసుక తవ్వకాలు చేపట్టనున్నట్టు అధికారులు పేర్కొన్నారు. బరాజ్‌ల వద్ద ఇసుక తవ్వకాల ద్వారా రూ. 1000 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందని అంచనా. రాష్ట్రంలో 100కు పైగా ఇసుక రీచ్‌లు ఉన్నప్పటికీ ఎన్జీటీ కేసులు, ఇతరత్రా కారణాలతో ప్రస్తుతం 33 రీచ్‌ల నుంచి ఇసుకను తవ్వి సరఫరా చేస్తున్నారు. 60 లక్షల టన్నుల వరకు ఇసుక స్టాక్‌యార్డ్‌లో సిద్ధంగా ఉన్నందున వర్షాకాలంలో ఇసుక కొరత ఉండదని అధికారులు భరోసా వ్యక్తం చేస్తున్నారు.

కాళేశ్వరం విచారణ కమిషన్ ఎదుట డీఈల హాజరు

- అఫిడవిట్లు దాఖలు చేయాలి
- కమిషన్ చైర్మన్ చంద్రఘోష్ ఆదేశం

హైదరాబాద్, జూలై 9(నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిషన్ ఎదుట మంగళవారం 20మంది డీఈలు హాజరయ్యారు. వివరణను అఫిడవిట్ల రూపంలో దాఖలు చేయాలని కమిషన్ చైర్మన్ జస్టిస్ చంద్రఘోష్ ఆదేశించారు. బుధవారం హాజరుకావాలని ఏఈఈలను సమాచారమిచ్చారు. గతంలో పనిచేసిన ఇరిగేషన్ సెక్రటరీలను కూడా పిలువనున్నట్టు తెలిసింది. ఎక్స్‌పర్ట్ కమిటీ రిపోర్ట్‌ను పరిశీలించిన జస్టిస్ చంద్రఘోష్.. మరికొన్ని డాక్యుమెంట్లు కావాలని కోరారు. నివేదికలోని కొన్ని అంశాలపై కమిషన్ వివరణ కోరింది. ఎన్డీఎస్‌ఏ, సీడబ్ల్యూపీఆర్‌ఎస్, సీడబ్ల్యూసీ విభాగాల్లో పలువురిని పిలువనున్నది. టెక్నికల్ విచారణ తుదిదశకు చేరడంతో అకౌంట్స్ విచారణను మొదలుపెట్టనున్నట్టు తెలిసింది. ప్రాజెక్టును విభేదించిన నిర్మాణ సంస్థ వ్యక్తిని కూడా కలువనున్నది. బరాజ్‌ల సమాచారం ఇస్తానని కేంద్ర జలశక్తి సలహాదారు వెదిరే శ్రీరామ్ తెలిపారు. ఆయన శుక్ర లేదా సోమవారం కమిషన్ ముందుకు రానున్నారు.

• పోచాపూర్‌లో కంటెయినర్ సబ్ సెంటర్

ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొడిశాల పీహెచ్‌సీ పరిధిలోని మారుమూల గ్రామాల ప్రజలకు వైద్య సేవలను అందించేందుకు ములుగు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వినూత్నంగా కంటెయినర్ సబ్ సెంటర్ ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రూ.7 లక్షలతో కంటెయినర్ సబ్ సెంటర్‌ను తీర్చిదిద్దారు. నాలుగు బెడ్‌లతోపాటు ప్రాథమిక చికిత్సను అందించేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. ఈ సబ్ సెంటర్‌లో సిబ్బందిని నియమించి మండల ప్రజలకు రోజూ వైద్య సేవలు అందిస్తారు. -తాడ్వాయి

అప్పుల బాధతో మహిళా కౌలురైతు ఆత్మహత్య

భీమదేవరపల్లి, జూలై 9: అప్పులు తీర్చే దారిలేక మనస్తాపం చెందిన ఓ మహిళా కౌలురైతు ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన మంగళవారం హనుమకొండ జిల్లాలో చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన ఏలూరి శ్రీనివాస్‌రెడ్డి, అతని భార్య సునీత (40)లకు వ్యవసాయ భూమి లేదు. కౌలు వ్యవసాయం చేసి జీవనోపాధి పొందుతున్నారు. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. కూతురు పెండ్లి, వ్యవసాయ పనుల కోసం రూ.15 లక్షలు అప్పు అయింది. చివరకు ఉన్న ఇంటిని అమ్మకానికి పెట్టారు. ఇల్లు అమ్మినా అప్పు తీర్చలేమని గ్రహించిన సునీత.. వంట గదిలో విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకుంది.

ఉద్యోగులకు ఫస్ట్‌కే జీతాలిస్తున్నం..

మొదటిపేజీ తరువాయి...

ప్రమోషన్లు, బదిలీలు చేశామని చెప్పారు. ఇకపై తాను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని చెప్పారు. కలెక్టర్ వారానికి ఓసారి దవాఖానలు, పాఠశాలలు తనిఖీ చేయాలని, డీఈవో, ఎంఈవోలు ప్రతిరోజు పాఠశాలలను విజిట్ చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో సీఎం రూ.353.66 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సమీక్షలో నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారులు పాల్గొన్నారు.

అధికారుల సమీక్షలో 'హస్తం' నేతలు

పాలమూరు కలెక్టరేట్‌లో జరిగిన ప్రభుత్వ అధికారిక సమీక్షా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొనడం చర్చనీయాంశమైంది. మాజీ ఎమ్మెల్యే సంపత్, పీసీసీ కార్యదర్శి వినోద్, గద్వాల మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాకు చెందిన కొందరు కాంగ్రెస్ నేతలు ఈ రివ్యూకు హాజరయ్యారు. కాగా రివ్యూ జరిగినంత సేపు కరెంట్ పోకుండా విద్యుత్ అధికారులు తంటాలు పడ్డారు. సీఎం పాల్గొన్న కార్యక్రమాల్లో ఎంపీలు డీకే అరుణ, మల్లు రవి, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్‌రెడ్డి, వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డి, వీర్లపల్లి శంకర్, తూడి మేఘారెడ్డి, వాకిటి శ్రీహరి, చిట్టెం పర్ణికారెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజేయుడు, ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి, ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కలెక్టర్లు, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.